క్లుప్తంగా

తైక్వాండో విజేతలకు అభినందనలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు అభినందించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో విజయనగరంలో జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు 9 మంది బంగారు పతకాలు సాధించగా... 1 రజత పతకం, 3 కాంస్య పతకాలు చేజిక్కించుకున్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే త్వరలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డివి చారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ విద్యాభ్యాసంతో మేలు



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీడీఓ తదితరులు

పూసపాటిరేగ: ఓపెన్ స్కూల్ విధానాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎం.రాధిక అన్నారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఏపీ ఓపెన్‌స్కూల్ విధానంపై మండలస్థాయి అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వాల్‌పోస్టర్లు విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభ్యాసం అర్థాంతరంగా ఆగిన వారికి, నిరక్షరాస్యులుగా వుండి మధ్యలో చదువు నేర్చుకొని ఉన్నత విద్యాభ్యాసం చేయదలచిన వారికి ఓపెన్ స్కూల్ విధానం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. మండల వ్యాప్తంగా 14 సంవత్సరాలు పైబడిన వారు 10, ఇంటర్‌లో ఓపెన్ స్కూల్ విధానంలో విద్యాభ్యాసం చేయవచ్చన్నారు. సమావేశంలో ఎంఈఓలు పాపినాయుడు, రాజ్‌కుమార్, ఏపీఓ రత్నమాల, ఏపీఎం పెంటం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం టౌన్: నగరంలోని తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. విశాఖకు చెందిన క్రిస్టల్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, సత్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో శ్రీకృష్ణ ఫార్మాస్యూటికల్ ప్రైవేట్ లిమిటెడ్, అరబిందో ఫార్మా కంపెనీలు ప్రొడక్షన్ విభాగంలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఎంపిక ప్రక్రియలో కంపెనీ డిప్యూటీ మేనేజర్లు ఎ.వీరభద్రరావు, రాజశేఖర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ హెచ్‌ఆర్ ఓ.మారేశ్వరరావు, రిక్రూట్‌మెంట్ హెడ్ ఆర్.విజయకృష్ణ పాల్గొని అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. మొత్తం 171 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 41 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు మాట్లాడుతూ ఉద్యోగాలు సంపాదించుకోవడం చాలా కష్టంగా ఉన్న నేపథ్యంలో సంస్థలు ముందుకు వచ్చి అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న వారందరికీ అభినందనలు తెలిపారు. ఎక్కడ ఉద్యోగం వచ్చినా చేరిపోవాలని, అప్పుడే ఎక్స్‌పీరియన్స్ వచ్చి, మరిన్ని మంచి అవకాశాలు దక్కించుకుంటారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్‌వి.సాయిదేవమణి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో అధిక సంఖ్యలో అభ్యర్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక సంగీత విభావరి



ఆధ్యాత్మిక సంగీత విభావరిలో భక్తి గీతాలాపన చేస్తున్న దీప్తి

విజయనగరం టౌన్: స్థానిక మూడులాంతర్లు వద్దనున్న పైడితల్లి అమ్మవారి చదురుగుడి ఆవరణలో మంగళవారం రాత్రి విశాఖ జిల్లా సింహాచలానికి చెందిన శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ నిర్వాహకురాలు కొల్లూరు దీప్తి నిర్వహించిన సంగీత విభావరి ఆద్యంతం ఆకట్టుకుంది. అమ్మవారి భక్తి పాటలను ఆలపించి అందరిమన్ననలు పొందారు. అనంతరం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కళాకారులను దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, అమ్మవారి ప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దోమలపై దండయాత్ర



అయ్యకోనేరు ప్రాంతంలో యాంటీ లార్వా ఆపరేషన్‌కు సిద్ధం చేసిన డ్రోన్

- డ్రోన్‌ల సహకారంతో నియంత్రణకు చర్యలు
- అయ్యకోనేరు ప్రాంతంలో ప్రయోగాత్మకంగా అమలు
- 6 లీటర్ల ద్రావణాన్ని కోనేరు చుట్టూ పిచికారీ చేసిన ఏజెన్సీ నిర్వాహకులు
- త్వరలో నగర వ్యాప్తంగా అమలుకు చర్యలు

విజయనగరం: ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు పంజా విసురుతున్నాయి. ప్రతి ఇంట్లో జ్వర పీడుతులు ఒకరో.. ఇద్దరో ఉంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం చుట్టూ ఉన్న పరిసరాలు. వాటిని ఆవాసంగా చేసుకుంటున్న దోమలు కారణంగా ప్రతి ఒక్కరు రోగాల బారిన పడుతున్న పరిస్థితి. ఇందుకు ప్రతి రోజు నగరంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్న జ్వరపీడితులే నిదర్శనంగా నిలుస్తున్నారు. గతంతో పోల్చుకుంటే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ ఏడాది దోమల బెడద ఎక్కువైంది. ఈ నేపథ్యంలో అధికారులు తీసుకుంటున్న చర్యలు అంతగా సత్ఫలితాలు ఇవ్వకపోవటంతో నూతన ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నారు. దోమలకు ఆవాసంగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్‌ల సహాయంతో యాంటీ లార్వా ఆపరేషన్ చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అయ్యకోనేరు ప్రాంతంలో ఓ ఏజెన్సీ నిర్వాహకుల పర్యవేక్షణలో డ్రోన్‌తో యాంటీ లార్వా ఆపరేషన్‌ను ప్రయోగాత్మకంగా నిర్వహించారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి ఆదేశాలతో కౌన్సిల్ సూచనలతో తొలిసారిగా డ్రోన్ సహాయంతో చేపట్టిన ఏంటి లార్వా ఆపరేషన్ విజయవంతమైంది. ప్రయోగించిన డ్రోన్ అయ్యకోనేరు చుట్టూ తిరిగి బీటీఐ ఆయిల్ పిచికారిని చేపట్టింది. వాస్తవానికి డ్రోన్‌లో 10 లీటర్ల పిచికారీ మందు వేసే సౌలభ్యం ఉన్నప్పటికీ, ప్రయోగాత్మకంగా చేపడుతున్న కారణంగా 6 లీటర్లు మాత్రమే పిచికారీ మందును ఏజెన్సీ నిర్వాహకులు వేశారు. మొత్తం పిచికారీ మందు పరిపూర్ణంగా వెదజల్లిన డ్రోన్ దోమల నియంత్రణకు సహాయకారిగా నిలిచింది. ఈ సందర్భంగా కమిషనర్ ఎంఎం నాయుడు మాట్లాడుతూ దోమల నియంత్రణ చర్యల్లో భాగంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన డ్రోన్ పిచికారీ ప్రక్రియ విజయవంతమైందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో చెరువులు, కుంటలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో డ్రోన్‌ల సహాయంతో బీటీఐ ఆయిల్ ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం నగర వ్యాప్తంగా ఉన్న నీటి నిల్వ కేంద్రాలను గుర్తించే ప్రక్రియను చేపడతామని వివరించారు. డ్రోన్ సహాయంతో ఏఎల్ఓ ప్రక్రియ చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తిని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ పనితీరుపై ఏజెన్సీ నిర్వాహకులతో చర్చిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

కేఎల్‌పురంలో పర్యటించిన కమిషనర్

విజయనగరం: నగరంలోని 45వ డివిజన్ కేఎల్ పురం ప్రాంతంలో కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు మంగళవారం క్షేత్ర స్థాయి పర్యటన చేసి పారిశుద్ధ్య నిర్వహణ ఏ విధంగా ఉందో తెలుసుకున్నారు. మురికి కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న పరిస్థితిని గమనించారు. అక్కడున్న పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, కార్యదర్శి తక్షణమే సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ జరుగుతున్న తీరును ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తడి పొడి చెత్తలను వర్గీకరించి చెత్త తరలించే వాహనాలకు అందివ్వాలని చెప్పారు. తాళ్ళపూడి పండు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ పౌర్ణమి మహోత్సవాలకు రంగం సిద్ధం



శ్రావణ పౌర్ణమి కార్యక్రమాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న టీటీడీ ప్రోగ్రాం మేనేజర్ శ్యామ్ సుందర్, తదితరులు

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మనగుడిలో భాగంగా శ్రావణ పౌర్ణమి మహోత్సవాలకు రంగం సిద్ధం చేసినట్లు టీటీడీ ప్రోగ్రాం మేనేజర్ జె.శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ మేరకు టీటీడీ ఆవరణలో మంగళవారం ఫ్లెక్సీలు, పోస్టర్‌లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ఈ నెల 16న శుక్రవారం ఉదయం 9 గంటలకు వరలక్ష్మీ వ్రతాలు, 19న సోమవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీవారి కల్యాణోత్సవం అత్యంత వైభంగా నిర్వహిస్తామన్నారు. అదేరోజు సాయంత్రం శ్రావణ పౌర్ణమి విశిష్టత ప్రవచనం, 27న మంగళవారం ఉదయం 9 గంటలకు గోకులాష్టమి సందర్భంగా గోపూజ ఉంటుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అడ్డాపుశీల గ్రామం శ్రీరామాలయంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పీవీ నరసింహాచార్యులు, అమ్మా నాన్న సేవా సంస్థ కార్యదర్శి జి.తిరుపతిరావు, బుచ్చిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు మానాప్రగడ జయంతి

విజయనగరం టౌన్: మధురవచస్వి మానాప్రగడ శేషసాయి జయంతి కార్యక్రమాన్ని వాగ్దేవీ సమారాధనం సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురజాడ గ్రంథాలయం మేడపైన ఉన్న చాసో భవనంలో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పివిఎల్.సుబ్బారావు, విశిష్ట అతిథిగా నాలుగెస్సుల రాజు, ఆత్మీయ అతిథిగా గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎం.ఆర్ కళాశాల విశ్రాంత భాషోపన్యాసకులు ఎబి.సుబ్బారావు, డాక్టర్ మరడాన శ్రీనివాసరావులను సత్కరించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి మానాప్రగడ అభిమానులు, సాహితీవేత్తలందరూ హాజరు కావాలని కోరారు.

జిల్లా పోస్టల్ కార్యాలయానికి చేరిన జాతీయ జెండాలు

విజయనగరం టౌన్: హర్ ఘర్ తిరంగాలో భాగంగా జిల్లా పోస్టల్ కారాలయానికి జాతీయ జెండాలు చేరినట్టు జిల్లా పోస్టల్ సహాయ సూపరింటెండెంట్ కింతాడ మధు తెలిపారు. కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షుడు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఈస్ట్, వెస్ట్ గజపతినగరం, ఎస్.కోట నాలుగు సబ్ డివిజన్‌లలో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జెండా ఖరీదు రూ. 25 రూపాయలన్నారు. ప్రతి ఒక్కరినీ ఉత్తేజితులను చేయాలన్నదే ప్రధాని మోడీ లక్ష్యమని, ప్రజలంతా వారి ఇంటిపై ఆగస్టు 15వ తేదీ వరకూ జాతీయ జెండా ఎగురవేయాలని, ఎగురవేసిన జాతీయ పతాకంతో సెల్ఫీలు దిగి వెబ్‌సైట్ పోస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో సౌత్ మండల అధ్యక్షుడు ఇప్పిలి గోపాలకృష్ణ రూరల్ మండల అధ్యక్షుడు కంది సీతారాం, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బూర జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాలను ఆవిష్కరిస్తున్న జిల్లా పోస్టల్ సహాయ సూపరింటెండెంట్ మధు, బీజేపీ నాయకులు

ఘనంగా 'నషా ముక్తి భారత్ అభియాన్'

విజయనగరం అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకొని నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమాన్ని స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వికసిత్ భారత్ కా మంత్రి, 'భారత్ కో నషాసే స్వతంత్ర' అనే థీమ్‌తో చేపట్టిన కార్యక్రమాన్ని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత దురాలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. తొలుత ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'ఫ్లాష్ మాబ్'ను విద్యార్థులు ప్రదర్శించారు. పట్టణ వీధుల్లో మయూరి జంక్షన్ నుంచి కోట కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాల్స్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అవయవదానం మహాదానం



నజిమా బేగంను సత్కరిస్తున్న జయచంద్రనాయుడు

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్రనాయుడు

విజయనగరం ఫోర్ట్: అవయవదానం మహాదానమని ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముర్రు జయచంద్ర నాయుడు అన్నారు. స్థానిక తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో అవయవదానంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు అవయవదానం చేసి 8 మంది ప్రాణాలు కాపాడాలని అన్నారు. అవయవదానం పాఠశాల విద్యార్థుల నుంచి ప్రారంభం కావాలన్నారు. మానవ శరీరంలో కిడ్నీ, లివర్, గుండె, కళ్లు అతిప్రధానమైనవని అన్నారు. మరణానంతరం వాటిని దానం చేసి మరొకరి ప్రాణం కాపాడాలని తెలిపారు. ఈ సందర్భంగా భర్తకి కిడ్నీ దానం చేసిన నజిమా బేగంను సన్మానించారు. కార్యక్రమంలో విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మోహన్ మహరాజ్, తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎం.డి డాక్టర్ తిరుమల ప్రసాద్, ఆస్పత్రి సెంటర్ హెడ్ పద్మకుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి మంజూరుకు వినతి

భోగాపురం: విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా గృహాలు కోల్పోయిన కొండపు కొండమ్మ, కొండపు రమణమ్మ, దువ్వు పైడమ్మ, బమ్మిడి రామసూరిలకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, అయితే ఇంతవరకు వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకెజీ ఇవ్వలేదని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ తెలిపారు. వీరికి వెంటనే లబ్ధిదారులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకెజీ మంజూరు చేయాలని తహసీల్దార్ సురేష్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: ప్రజల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తుందన్నారు. సమావేశంలో పలువురు సభ్యులు, అధికారులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ 2014 నుంచి కొందరి లబ్ధిదారులకు ఇళ్ల బిల్లులు మంజూరు కాలేదని, నాడు – నేడు పథకంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాలేదని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే నాగమాధవిని సత్కరించారు. సమావేశంలో ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ పి.సుదర్శనరావు, ఈఓపీఆర్‌డీ కె.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

17న ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ వేడుకలు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) ఆవిర్భావ వేడుకలు స్థానిక ఐఎంఏ హాల్‌లో ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తామని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు స్పష్టం చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు పేర్కొన్నారు. వేడుకలకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పలువురు ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన సంఘ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు. అనంతరం వేడుక షెడ్యూల్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎస్‌రాజు, సంఘం ప్రతినిధులు పంచాది అప్పారావు, రాధాకృష్ణ, మహాపాత్రో పాల్గొన్నారు.



ఆవిర్భావ దినోత్సవ వేడుకల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

రావమ్మా... మహాలక్ష్మీ... రావమ్మా...



భక్తుల పూజలందుకుంటున్న లక్ష్మీదేవి



శ్రావణమాసం రెండో మంగళవారం శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు వేడుకగా జరిగాయి. రావమ్మా.. మహాలక్ష్మీ... రావమ్మా...అంటూ మహిళలు పూజల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఇంటికి ఆహ్వానించారు. సామూహిక కుంకుమార్చనలు దుప్పాడ శ్రీక్షేత్రం వేద పండితుల ఆధ్వర్యంలో జరిగాయి. 108 మంది సువాసినీలు లక్ష్మీ సహస్రనామ స్తోత్రములు పఠించారు. కన్నుల పండువగా పూజలు నిర్వహించారు. – విజయనగరం

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం



పూసపాటిపాలెంలో తడిపొడి చెత్త కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, సర్పంచులు

పూసపాటిరేగ: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీఓ ఎం.రాధిక అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు రెండో రోజు శిక్షణ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రథమ పౌరులు బాధ్యతలను సర్పంచ్‌లు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించి మంచి పేరు సంపాదించుకోవాలని సూచించారు. ప్రభుత్వంతో వచ్చే నిధులతో పాటు ఆర్థిక సంఘం, పంచాయతీ నిధులు ద్వారా గ్రామాలను అభివృద్ధి పథంలో పయినింపజేయాలన్నారు. అనంతరం పూసపాటిపాలెం గ్రామంలో తడిపొడి చెత్త కేంద్రాన్ని ఎంపీడీఓ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు బృందం పరిశీలించింది. కేంద్రం నిర్వహణపై మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రౌతు స్వామి నాయుడు, పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికలతోనే అభివృద్ధి : డీపీఓ

భోగాపురం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రణాళికలను తయారు చేసుకోవాలని డీపీఓ శ్రీధర్‌రాజా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని నందిగాం పంచాయతీలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండవ రోజు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లోను తడి, పొడి చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని, ఆ చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి వాటిని ఎరువులుగా మార్చుకుని పంచాయతీలకు ఆదాయం వచ్చే విధంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం సర్పంచ్ గరే మురళీమోహన్‌రావు గ్రామంలో ఏర్పాటు చేసిన తడి, పొడి చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సురేష్, మండలంలోని వివిధ పంచాయితీలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ శ్రీధర్‌రాజా

డ్రైనేజీ, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- కార్పొరేషన్ అధికారులతో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మురుగునీటి, తాగునీటి, విద్యుత్ తదితర అత్యవసర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. వంద రోజుల, ఏడాది ప్రణాళికలు తయారు చేసినప్పటికీ మున్సిపాలిటీ పరిధిలో అత్యవసరంగా చేపట్టవలసిన కార్యక్రమాలు కొన్ని ఉంటాయని వాటిని వెంటనే పరిష్కరించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేసారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలసి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ముందుగా ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ నగరంలో డ్రైనేజి సమస్య ఎక్కువగా ఉందని ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. అదే విధంగా 21, 22, 23 వార్డులలో కుళాయిలలో బురద నీరు వస్తోందని మున్సిపల్ పరిధిలో ఉన్న పాఠశాలలలో పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజనం మెరుగుపడాల్సి ఉందని తెలిపారు. అక్టోబర్ 2లోగా నగరంలో ఎక్కడా డ్రైనేజ్ సమస్య లేకుండా పరిష్కరించాలని అన్నారు. మున్సిపల్ అధికారులు వారంలో కనీసం రెండు పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని, పారిశుద్ధ్యాన్ని తనిఖీ చేయాలని డీఈఓ ప్రేమకుమార్‌కు ఆదేశించారు. డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణల వలనే మురుగు ప్రవహిస్తోందని ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్యే కోరగా వెంటనే ఆక్రమణలు గుర్తించి తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కొండపల్లి సాంబమూర్తి, పబ్లిక్ హెల్త్ ఈఈ దక్షిణామూర్తి, డీఈ అప్పారావు, ఎలక్ట్రిక్ ఎస్ఈ లక్ష్మణరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.